క్లుప్తంగా

నగరపాలక సంస్థ సీపీగా ప్రదీప్ కుమార్

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా ప్రదీప్ కుమార్ నియమితులయ్యారు. టౌన్ ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న ప్రదీప్ కుమార్‌ను గుంటూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి జీఓ జారీ చేశారు. గత కొన్నేళ్లుగా సిటీ ప్లానర్ పోస్టు ఖాళీగా ఉండటంతో డీసీపీగా నియమితులైన మూర్తి ఇన్చార్జి సీపీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టు భర్తీ చేయడంతో పరిపాలన సౌలభ్యానికి మార్గం సుగమమైంది.

కాపునాడు నగర కార్యవర్గం నియామకం



పాతగుంటూరు: జిన్నాటవర్ సెంటర్‌లోని కాపునాడు జోన్–3 కార్యాలయంలో ఆదివారం నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ నాయకులు మిరియాల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాపునాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, జోన్ 3 అధ్యక్షుడు బొందలపాటి వెంకట్రావు ఆధ్వర్యంలో గుంటూరు నగర కమిటీ నియామకం జరిగింది. గుంటూరు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శిగా రాగం సదాశివరావు, కార్యదర్శిగా డేగల వెంకటేశ్వరరావు, గుంటూరు తూర్పు అధ్యక్షుడుగా బండి రామప్రభు, మహిళా అధ్యక్షురాలుగా గంటా మౌళిక, గుంటూరు పశ్చిమ మహిళా అధ్యక్షురాలుగా గంగం మల్లేశ్వరీలను నియమించారు. అనంతరం నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు యర్రగోపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోను ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

మహిళలకు సన్మానం



నెహ్రూనగర్: ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమని ఫాదర్ తుమ్మ వెలంగిణి తెలియజేశారు. ఆదివారం ఏసీ కాలేజీలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష చూపకుండా వారికి తగిన భరోసా కల్పిస్తూ, ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఏసీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కనపాల జోసఫ్, ఫాదర్ ఎస్‌వీ థామస్, వై.బాల, కె.సాగర్, ఎం.మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నెహ్రూనగర్: రిజర్వేషన్లు బహుజనులకు దక్కడమే సామాజిక న్యాయమని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులవృత్తులకు తగిన ప్రోత్సాహం లేదని, బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తగిన కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు సాధం సత్యనారాయణ, మురళీకృష్ణ, పీవీ రమణయ్య పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మీపురం: గుంటూరు రెడ్డిపాలెం ఇన్నర్‌రింగ్ రైల్వే గేటు సమీపంలోని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పట్టాలపై పడి ఉన్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు వచ్చిన సమాచారం ప్రకారం హుటాహుటిన ఘటనా స్థలానికి జీఆర్పీ పోలీసులు చేరుకున్నారు. స్థానికంగా చుట్టు పక్కల వారిని విచారించగా గుర్తు తెలియని వ్యక్తిగా ధ్రువీకరించారు. దీంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 7386843339, 0863–2220753 నంబర్లకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

పేదలకు అండ వైఎస్సార్ సీపీనే

- ఉద్యమంలా మొదలైన వైఎస్సార్ సీపీ ప్రస్థానం
- పార్టీ జెండా ఎగురవేసిన ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్
- వాడవాడలా ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్, డిప్యూటీ మేయర్లు బాలవజ్రబాబు, సజీల, నేతలు

పట్నంబజారు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఉద్యమంలా మొదలైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్థానం – అశేష ప్రజల ఆదరాభిమానాలతో పోరాట పటిమతో ఎదిగి, బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా ఒదిగిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్‌లు పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, అవినీతి రహిత, అభివృద్ధి – సంక్షేమ సహిత సమాజ స్థాపనే ధ్యేయంగా రాష్ట్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, డొక్కా, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, షేక్ మొహమ్మద్ ముస్తఫా, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాలుపురం రాము తదితర నేతలంతా కలిసి పార్టీ జెండా ఎగురవేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కేక్‌ను కట్ చేశారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజల సానుకూలతతో 51 శాతం ఓట్లు సాధించి సీఎం అయిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు అప్పుల ఊబిలో వదిలి వెళ్లిన రాష్ట్రాన్ని సీఎం జగన్ అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు మేలు జరిగే ఏ అంశంపైన అయినా వెంటనే పార్టీ, ప్రభుత్వం స్పందిస్తుందనే విధంగా సీఎం జగన్ నాయకత్వం వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు సేవ చేసే పార్టీగా వైఎస్సార్ సీపీని తీర్చిదిద్దారన్నారన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి టీడీపీకి నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. టీడీపీలా వైఎస్సార్ సీపీ దోపిడీ పార్టీ కాదన్నారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, మిర్చియార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ వై.షేక్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు బండా రవీంద్రనాథ్, గులాం రసూల్, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), కాకి శ్రీను, గనిక జాన్సీ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, ముస్తఫా



పాత బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి, మేయర్ కావటి

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ఆధ్వర్యంలో..

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, సీఈసీ సభ్యుడు తాడిశెట్టి మురళీమోహన్‌లతో కలిసి ఎమ్మెల్యే గిరి పలు ప్రాంతాల్లో వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా స్తంభాలగరువులోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కేక్ కట్ చేశారు. పట్టాభిపురంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. శ్రీరాంనగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వేడుకలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాసరావుపేటలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నేతలు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, కార్పొరేటర్‌లు డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆవిర్భావం ఒక చరిత్ర..

పట్నంబజారు: రాష్ట్ర రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం ఒక చరిత్ర అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా జెండాను ఎగురవేసి, కేక్‌ను కట్ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డొక్కా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ నైతిక విలువలతో రాజకీయాలు చేయాలన్నదే సీఎం జగన్ సిద్ధాంతమన్నారు.



పార్టీ జెండా ఎగురవేస్తున్న డొక్కా, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు ముస్తఫా, శ్రీదేవి

ఎన్నికల వేళ చెప్పిన మేనిఫెస్టోను భవగద్గీత, బైబిల్, ఖురాన్ భావించే గొప్ప వ్యక్తి సీఎం జగన్ కొనియాడారు. ఎమ్మెల్యేలు ముస్తఫా, ఉండవల్లి శ్రీదేవి మాట్లాడారు. పార్టీ సీఈసీ సభ్యుడు తాడిశెట్టి మురళీమోహన్, వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరక్టర్లు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి నాగభైరవ ఆదినారాయణ

పాతగుంటూరు: తెలుగు భాషోద్యమ నాయకుడిగా, రచయితగా, పరిశోధకుడిగా, కవిగా, బాల సాహిత్యకారుడిగా, ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ నాగ భైరవ ఆదినారాయణ బహుముఖ ప్రజ్ఞాశాలి అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై ఎన్జీరంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ నాగ భైరవ ఆదినారాయణ రాసిన 'మట్టి బండి' గ్రంథావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. వికాస్ విద్యాసంస్థల అధినేత పీవీ శంకరరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా బుద్ధప్రసాద్ పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ భూమిపుత్రుల కష్టాల కడగళ్లను, వారి దుర్భర జీవితాన్ని మట్టిబండి దీర్ఘ కవిత ద్వారా డాక్టర్ నాగ భైరవ కళ్లకు కట్టినట్టు వర్ణించాడని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగభైరవ ఆదినారాయణకు 'భాషా విభూషణ' బిరుదు అందించి సత్కరించారు. డాక్టర్ పెళ్లూరు సునీల్ గ్రంథ సమీక్ష చేశారు. డాక్టర్ వెనిశెట్టి సింగారావు సభను నిర్వహించగా కార్యక్రమంలో సీరం రామారావు, మక్కెన ఆంజనేయ రావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



గ్రంథావిష్కరణ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్, కొలకలూరి ఇనాక్ తదితరులు

గీత రచనాదీపిక గ్రంథావిష్కరణ

పాతగుంటూరు: పాట, పద్య రచనలు చేయటంలో విలక్షణ కవిగా కొణతం నాగేశ్వరరావు కీర్తి గడించారని ఏఎన్‌యూ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ జి.కృపాచారి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట కొరటాల సమావేశ మందిరంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సాహితీ కళారత్న కొణతం నాగేశ్వరరావు రచించిన 'గీత రచనాదీపిక' గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సభకు డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆచార్య కృపాచారి పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి మేళం బాబురావుకు తొలి పుస్తకాన్ని అందించారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గీత రచనా దీపిక భావి కీర్తనకారులకు, గేయ రచయితలకు కావలసిన సంగీత, సాహిత్య, స్వర, తాళ, లయాత్మక దిక్సూచిగా ఉందని ఆ కోవలో గ్రంథ రచన చేసిన తొలి రచయిత నాగేశ్వరరావు అని ప్రశంసించారు. తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు కేజే రమేష్ గ్రంథ సమీక్ష చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, సాహితీవేత్తలు బి.వేదయ్య, ఎంపీ జాను, బొమ్ము ఉమామహేశ్వర రెడ్డి, రావి రంగారావు, కందిమళ్ళ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథావిష్కరణలో పాల్గొన్న కృపాచారి, నాగరాజ్యలక్ష్మీ, బాబూరావు

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంపత్‌నగర్‌కు చెందిన శింగంశెట్టి మణికంఠ (22) ఇంటర్మీడియెట్ వరకు అభ్యసించాడు. ఆదివారం తల్లిదండ్రులు పలు పనుల నిమిత్తం పొన్నూరుకు వెళ్లారు. ఈ క్రమంలో నివాసంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే మృతి గల కారణాలు పూర్తిగా తెలియరాలేదని తెలిపారు. ప్రేమ విఫలమా.. ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయా.. అని విచారిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహం నిర్వహిస్తున్న మహిళపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యభిచార గృహం నిర్వహిస్తున్న మహిళపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్‌గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఓ ఇంట్లో పి.లక్ష్మి వ్యభిచారం నిర్వహిస్తుంది. ఆమెను ఇద్దరు మహిళలను, విటుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇరువురు మహిళలను రెస్క్యూ హోంకు తరలించారు.

జూదరులపై కేసు నమోదు

పెదకాకాని: పేకాటాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామ శివార్లలో పేకాటాడుతున్నట్లు ఆదివారం పోలీసులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేసిన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,980, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

మృదంగ విద్వాన్ నటేశన్‌కు ఘనసత్కారం

పాతగుంటూరు: బృందావన గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళాసంగీత సన్మండలి 26వ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సభకు సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఆలయ అధ్యక్షుడు సి.హెచ్. మస్తానయ్య పాల్గొన్నారు. విశాఖ పట్నంకు చెందిన మృదంగ విద్వాన్ సాయికేశవ నటేశన్‌ను అతిథులు సత్కరించారు. సంస్థ గౌరవాధ్యక్షులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన గాత్ర కచేరీ సంగీతాభిమానులను అలరించింది. కార్యక్రమాలను కార్యదర్శి ఏవీ మంగాదేవి, ఉపాధ్యక్షురాలు పాటిబండ్ల లలిత పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలు, పరిరక్షణపై సమావేశం

నెహ్రూనగర్: ప్రభుత్వాలు అప్పులపై ఎక్కువగా ఆధారపడుతున్నాయని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదివారం జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో రాజ్యాంగ వ్యవస్థలు, పరిరక్షణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చట్టసభలలో ఎలాంటి చర్చ జరగకుండానే మూజువాణి ఓటింగ్‌తో చట్టాలు రూపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో డబ్బు పాత్ర గణనీయంగా పెరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ ఆవిర్భవిస్తేనే ఎన్నికల అక్రమాలకు అడ్డుకట్ట వేయగలమన్నారు. ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ ఎన్.రంగయ్య, ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటనపై నగరపాలెం పోలీసులు కేసు నమోదు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చుట్టుగుంటలోని సాయి విల్లా అపార్ట్‌మెంట్ పక్క సందులో పిడుగురాళ్లకు చెందిన చల్లా రాము (40) ఆదివారం అనుమానస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అతని తండ్రి వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహానికి మార్చుకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

లక్ష్మీపురం: స్వచ్ఛంద సంస్థలు అందించే సేవాకార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. స్థానిక చంద్రమౌళినగర్‌లోని స్వచ్ఛ హృదయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జొన్నలగడ్డ రాజమోహన్‌రావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎండలు రోజు రోజుకు అధికంగా ఉంటున్నాయని ఇటువంటి తరుణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.

తొలిదశలోనే నేత్ర సమస్యలు గుర్తించాలి



వృద్ధుడికి స్వయంగా కళ్లజోడు పెడుతున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



దివ్యాంగుడు నాయుడు బాబులుకు వీల్ చైర్ అందజేస్తున్న అంబటి మురళీకృష్ణ, హరినాథరెడ్డి

> బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): తొలి దశలోనే నేత్ర సమస్యలను గుర్తించి కళ్లజోళ్లను అందించడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే అనేక నేత్ర సమస్యలను అధిగమించవచ్చని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపట్ల నియోజకవర్గంలోని ముత్తాయపాలెం గ్రామంలో ఆదివారం కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లోని గంగపుత్రులు, మత్స్యకార కుటుంబాలే లక్ష్యంగా నిర్వహించిన ఈ శిబిరానికి అనూహ్య రీతిలో స్పందన లభించిందని, మొత్తం 702 మందికి ఈ నెల 6వ తేదీన నేత్ర పరీక్షలు నిర్వహించగా, వారిలో కళ్లజోళ్లు అవసరమైన 508 మందికి కేవలం ఆరు రోజుల వ్యవధిలోనే అందించడం జరిగిందన్నారు. రంగుల ప్రపంచాన్ని సాక్షాత్కరింపజేసే కంటి చూపును తిరిగి పొందిన వారి కళ్లలో కనిపించే సంతృప్తి ముఖ్యమని, బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి కార్యక్రమంలో అంతర్లీనంగా ఉన్న భావం ఇదేనన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన స్ఫూర్తిగా మొదలైన 'జగన్నామ సంక్షేమసంవత్సరం'–సేవా కార్యక్రమాల పరంపర ఏడాది చివరి వరకూ కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 7వ శిబిరం తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలకు చేరువగా ముత్తాయపాలెంలో విజయవంతంగా పూర్తి కావటంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 6,700 మందికి నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించి, 4,800 మందికి కళ్ల జోళ్లు అందించడం జరిగిందన్నారు.

వీల్ చైర్ బహూకరణ...

బాపట్లమండలం, ఆదర్శనగర్ గ్రామంలో తీవ్ర అంగ వైకల్యంతో బాధపడుతున్న నాయుడు బాబులు అనే యువకుడికి బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ ఆదివారం వీల్‌చైర్ బహూకరించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో జీవనపోరాటం చేస్తున్న నాయుడు బాబులు తల్లి శేషమ్మశ్రమ అంతా ఇంతా కాదన్నారు. వారి కష్టాలను తమ దృష్టికి తీసుకువచ్చిన వలంటీర్ నారాయణకు ప్రత్యేక అభినందనలన్నారు. ఆదర్శనగర్ వలంటీర్ నారాయణ మాట్లాడుతూ నాయుడు బాబులు సమస్య గురించి బజరంగ్ దృష్టికి తెచ్చిన వెంటనే మానవతా దృక్పథంతో వీల్ చైర్ బహూకరించిన బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కళ్లం హరినాథరెడ్డి, బజరంగ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం రైలుపేటలోని కన్న స్కూల్లో సమైఖ్య ప్రైవేటు లెక్చరర్స్–టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్టీఓ) ఆవిర్భావ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు భాగమేనని, వారి హక్కుల సాధన కోసం శాసన మండలి వేదికగా ప్రభుత్వంతో చర్చిస్తామని పేర్కొన్నారు. కొత్తపేట సీఐ శీలం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘానికి తమ పూర్తి సహకారాన్ని అందజేస్తామని తెలిపారు. ఎస్పీఎల్టీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేష్ ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి. నాగయ్య మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకుల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించడమే తమ ఆశయమని, దీని కోసం కలసి వచ్చే ప్రతి ఒక్కరినీ, పార్టీలను తాము కలుపుకొని ముందుకు వెళతామని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వి.చంద్రశేఖర్‌బాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శి పి.రాజారత్న కుమార్, రాష్ట్ర సమన్వయకర్త పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కె.కోటిరెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కన్న స్కూల్ డైరెక్టర్ కన్న మాస్టారు, జిల్లా, మండల స్థాయి నాయకులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సంఘం లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసులురెడ్డి, కన్న మాస్టారు

సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజెప్పాలి

పట్నంబజారు: విద్యార్థుల తల్లితండ్రులు వారికి విద్యతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజెప్పాలని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. పాతగుంటూరులోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం మంజునాథ నాట్య క్షేత్రం వారి ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది.

వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. న్యాట్య మండలి కళామయూరి ఆర్.మనోజ్ఞ ఆధ్వర్యంలో నృత ప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ తెలుగు సంస్కృతిని తెలియజేసే కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారుల్లో ఉన్న కళా నైపుణ్యానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అండగా నిలిచే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముస్తఫాను దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. స్థానిక కార్పొరేటర్ యర్రి ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత యర్రి సాయి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముస్తఫాను సత్కరిస్తున్న మనోజ్ఞ, కార్పొరేటర్ ధనలక్ష్మి తదితరులు

విలువలతో కూడిన విద్యతో సమగ్ర వికాసం

గుంటూరు ఎడ్యుకేషన్: విలువలతో కూడిన విద్యతో విద్యార్థుల్లో సమగ్ర వికాసం కలుగుతుందని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ 39వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు విద్యాబోధనతో పాటు విద్యార్థులకు నైతిక విలువలను, సమాజంపై బాధ్యతను నేర్పించాలని సూచించారు. కాలానుగుణంగా సాంకేతిక విద్యను అందిస్తూ, తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా నడుచుకునే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యతో పాటు సృజనాత్మకత నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలతో విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదుగుతారని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి పాఠశాలలో ఏడాది పొడవునా చేపడుతున్న కార్యక్రమాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. విద్యాసంవత్సరంలో పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె. బసవపున్నయ్య, ఏఓ కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని సత్కరించి, జ్ఞాపిక అందజేస్తున్న రాయపాటి శ్రీనివాస్